'రాగమయి'

శ్రీ విజయ - రాఘవ

(గతసంచిక తరువాయి)

“అత్తయ్యా! నీ కంత మనసుగావుంటే రాగమయిని గురించి నీ కంతగా చెప్పవలసిన పనిలేదు. కాని, యీ రోజునిలా మనిద్దరికి జరిగిన విషయం గురించి దానికి ప్రస్తుతం తెలియనివ్వొద్దు. కొంత కాలంవరకు మనసులో వుంచుకో! బయట పెట్టామా, దాని చదువు చెడగొట్టిన వాళ్ళమవుతాం. తరువాత మరోవిషయం— శ్యామసుందరి వివాహం యీ సంవత్సరం మాఘమాసంలో జరిగేటట్లు చేద్దామని అందుకు నువ్వేమంటావ్?” అన్నాడు రఘునాథం.

“మంచి లగ్నాలుంటే అలాగే చేద్దాం. అన్నట్లు యెవరికి!” అంది సుందరమ్మ,

“ఎవరో దాకా యెందుకూ? పార్వతీశం కొడుకున్నాడుగా కేశవుడు.” అన్నాడు రఘునాథం.

సుందరమ్మకు అయిదు సంవత్సరాల చుట్టరికం గుర్తుకొచ్చింది. మొగం చిట్లించుకొంది. రఘునాథం మొగం వంక తేటగా చూడలేక, మరోవైపు చూస్తూ—

“రఘూ! వాళ్ళతో యేనాడో మామయ్యుండగానే బాంధవ్యం తెగతెంపులు చేసుకొన్నాం. ఏ మొగం పెట్టుకొని మళ్ళాబోయి వాళ్ళ కాళ్ళు బట్టుకోవటం, నాకిష్టంలేదు. చూస్తూ చూస్తూ శ్యామసుందరి గొంతుక్కి వురి వేయలేను. భగవంతుడు చల్లగా చూస్తే అయినప్పటికే అవుతుంది. వాడికిచ్చి సుఖపడేకన్నా, పరాయివాడికిచ్చి బాధపడటం మేలు. యీ సంబంధం సుతరామూ నాకిష్టంలేదు. వాళ్ళను గురించి నాకెటువంటి బాంధవ్యంకూడా అక్కర్లేదు. యిలా అంటున్నానని నువ్వు కష్టపెట్టుకోవద్దు. నువ్వు చిన్నవాడివి. వాళ్ళెటువంటివాళ్ళో నీ కింకా తెలియదు. మరోమారు తీరిగ్గా చెబుతాలే “అదుగో! అమ్మాయిలొస్తున్నారు.” అంది సుందరమ్మ వీధి తలుపువంక చూస్తూ.

రఘునాథంకి తను చెప్పిన సంబంధం అత్తయ్య వొప్పుకోలేదని, నిష్కర్షగా కుండ బద్దలుగొట్టి చెప్పేసిందని కించిత్ కూడా కోపంరాలేదు. “వాళ్ళకూ— వాళ్ళకూ యేం మనస్పర్థలున్నాయో లోగడ, మనకేం తెలుసు” అని వూరుకొన్నాడు.

శ్యామసుందరి, రాగమయి సరాసరి లోపలికివస్తూ, రఘునాథంవంక రాగమయి తీయగా చూస్తే, శ్యామసుందరి చల్లగా చూసింది.

సుందరమ్మ తనలోతాను నవ్వుకొంది. రఘునాథం అదోలా చూస్తూ ముసి ముసిగా నవ్వుకొన్నాడు.

4

సుందరమ్మ సంసారాన్ని వేరుగావుంచి వాళ్ళక్కావలసిన సౌకర్యాలన్నీ తనే సమకూరుస్తూ, లోకం అనుకునే మాటలకు కొంతవరకు బాధ్యుడు కాకుండా వుండాలని రఘునాథం కొంతవరకు ప్రయత్నించాడు. కాని అది మరో రూపంలో నెరవేరింది. “ఏమిటిరా! భగవంతుడా! ఒకవిధంగా తల్చుకుంటే మరోవిధంగా అయింది!” అని రఘునాథం నాలిక్కొరుకున్నాడు.

రఘునాథంకి యీ పరిస్థితులన్నీ యింటివద్ద వుండగానే తారుమారైనయి.

వేసంగి సెలవుల్లో సుందరమ్మ, శ్యామసుందరిని, రాగమయిని, చెల్లెలింటికి కోరితేనే పంపింది. కులాసాగానే వుంటున్నారని రెండుమూడుసార్లు మాత్రమే వుత్తరాలు వచ్చినయి. తరువాత కొంత కాలంవరకు వుత్తరాలేమీ రాలేదు. ఇలా వుండగా ఒకనాడు రఘునాథం పేరిట ఒక కవరు వచ్చింది. సుందరమ్మ ఆ కవరురావడం మామూలుగా రోజూ వచ్చే వుత్తరాలవంక చూసినట్లే చూసి తన పనిమీద తాను వెళ్ళిపోయింది. రఘునాథం ఆ కవరు విప్పి చదివి ఒక్క-

నిట్టూర్పు విడిచి పిల్లిలాగా లోపలికి వెళ్ళి, సుందరమ్మకా వుత్తరం యివ్వబోతూండగా సుందరమ్మ ఆ వుత్తరం వంక చూస్తూ !—

"ఏమిటిరా ! కబుర్లు !" అంది.

రఘునాథంకి జవాబెలా యివ్వాలో అర్థంకాలేదు. ముఖ కవళికలనుబట్టి సుందరమ్మ వెంటనే గ్రహించి "నువ్వే చదువు ! యేంవుందో !" అంది.

"శ్యామకి క్షయవ్యాధి తగిలినట్లు రాగమయి వుత్తరం వ్రాసింది." అన్నాడు.

సుందరమ్మ గొంతులో యేదో అడ్డుపడినట్లుగా అయింది. మొగమంతా యెలా తెలాపోయింది.

"ఎప్పటినుంచీ"—అంది.

"ఇప్పటికి యెంతకాలంనుంచో వ్రాయలేదు గాని, మొత్తానికి యిక్కడకొచ్చిన కొద్దిరోజుల్నుంచి" అని వ్రాసింది.

"అయితే యీ విషయం రాగమయికెలా తెలిసింది ?"

"ఎలాగేమిటి ! అత్తయ్యా ! ఆ వ్యాధివుండవలసిన లక్షణాలుబట్టి, అక్కడివాళ్ళంతా యిలా అనుకొని వుంటారు. విన్నమాటేమిటో వ్రాసింది." అన్నాడు.

"అయితే యెలా ?"

"ఎలాగేమిటి ! నువ్వేం కంగారు పడకు. బహుశా ! ఆ వ్యాధి యింకా ఆరంభ దశలోనే వుండివుంటుంది. త్వరగా క్షయాసుపత్రిలో చేరిస్తే, తేలిగ్గా నయమవుతుంది."—అన్నాడు రఘునాథం.

సుందరమ్మను బుర్ర చెడిపోయే ఆలోచనలు ముసురుకొన్నాయి.

"ఏదో చేతికొచ్చింది గదా ! యెక్కడో అక్కడ మంచిసంబంధాన్ని చూసి ఆ మూడుముళ్లువేసి, దాన్నొక యింటిదానిగాచేసి, కొంతవరకు హాయిగా వుందామని అనుకోవడమేమిటీ !, భగవంతుడు యీ విధంగా నా మొగాన వ్రాయడమేమిటీ ! యిప్పుడు దానికక్కవలసిన మందులూ, ఆసుపత్రిలో చేర్పించాలంటేనూ, ఎంత డబ్బు అవుతుందో తెలుసా ! మళ్ళా వేరే కాపురం. యీ విధంగా వేరేపోతే నువ్వేమో ! వొంటరివాడవు. చేతులు కాల్చుకొని తినటం జరుగుతుంది. యిదంతాయేమిటో రఘూ! నాకయోమయంగా వుంది. ఏం పాలుపోవడంలేదు." అంటూ సుందరమ్మ చెప్పుకొస్తూంటే, రఘునాథానికి యెలా నచ్చచెప్పాలో తోచలేదు. కాసేపు అటూ—యిటూ వంట యింట్లోపచార్లుచేయసాగాడు. మళ్ళా సుందరమ్మ దగ్గరకొచ్చి—

"అత్తయ్యా ! అయితే యిద్దర్నీ బయలుదేరి రమ్మనమని వ్రాయమంటావా !" అన్నాడు.

"ఇంకా అక్కడెందుకూ ! అనవసరంగా వాళ్ళ నెత్తిన కూర్చొనివుంటే పదిమంది నానా విధాలుగా అనుకొంటారు. ఇప్పుడే యీ విధంగా వుండినందుకు బాధ పడుతూంటే - అదికూడా తోడైతే మరీ యేడ్వాలి. తొందరగా బయలుదేరి రమ్మన్నానని వ్రాసెయ్" అంది సుందరమ్మ.

తెల్లవారటం జరిగిం తరువాత పోస్టాఫీసుకుపోయి కవరు కొనేంతవరకూ రఘునాథంకి యేం తోచలేదు. రెండు ముక్కలు తోచినట్లువ్రాసి, కవరు పోస్టులో వేసి యింటి ముఖం పట్టాడు.

సుందరమ్మ వాకిట్లోనే యెదురయి "కవరు వ్రాశావా !" అంది.

"ఆ... యిప్పుడే వ్రాసి డబ్బాలో పడేసి వస్తున్నా !" అన్నాడు రఘునాథం.

ఉత్తరం అందుకున్న మరునాడే శ్యామసుందరిని వెంటబెట్టుకొని రాగమయి జట్కాబండి దిగింది. బండి కిరాయి, రాగమయి దగ్గర చిల్లర లేకపోతే, రఘునాథమే యిచ్చి పంపించివేశాడు. శ్యామసుందరి మొగంవంక తేరిపార చూద్దామని రఘునాథం ప్రయత్నించాడు. "కాని రాగమయి యేమని ఆలో

చిస్తుందో యిలా చూస్తే" అనే బెరుకుతో పూరుకొన్నాడు. సుందరమ్మ అందించిన రెండు చెంబుల నీళ్ళతో కూతుళ్లిద్దరూ కాళ్లు కడుక్కున్నారు. రఘునాథం వాకిటి వసారాలో పడక కుర్చీలో పడుకొని యేదో ఆలోచిస్తున్నాడు. ఆరోజల్లా సుందరమ్మ శ్యామసుందరిని గురించి, రాగమయిద్వారా వినడమే సరిపోయింది, రఘునాథంకూడా వినకపోలేదు.

ఆ రాత్రి సుందరమ్మ బదులు రాగమయి వంట చేసింది. శ్యామసుందరి రొట్టె, పాలు త్రాగి పడుకొంది. రఘునాథం యేదో నలతపడినవాడు యెంగిలి పడ్డట్టుగా భోంచేసి, డాబామీద పడుకొంటానికి వెళ్ళిపోయాడు. సుందరమ్మ, రాగమయి ఒక్కమాటే అన్నానికి కూర్చొన్నారు. అన్నం తింటున్నంత పొడుగునా, సుందరమ్మ రఘునాథం మనస్తత్వాన్ని గురించి చూచాయగా చెబుతూ "శ్యామక్కయ్యకి రోగం నయమయ్యేంతవరకు తానే తప్పకుండా కావలసినంత డబ్బు సహాయం చేస్తానని మాటిచ్చాడు. ఆస్పత్రిలో చేర్చమని మరీ మరీ చెబుతున్నాడు. మరి నువ్వేమంటావ్" అని అడిగింది సుందరమ్మ యథాలాపంగా—

భోజనాలయినయి, తలుపులన్నీ జాగ్రత్తగా వేసి వచ్చి తల్లీ కూతుళ్ళు వాకిట్లో పడుకొన్నారు. రఘునాథం ఒంటరిగా పిండారబోసిన వెన్నెల్లో పడుకోలేక సతమతమవుతాడు. శ్యామసుందరి పడుకున్నదని రాగమయి, సుందరమ్మ నిశ్చింతగా వున్నారు. నిద్రలో ఘోరంగా దగ్గుతూనేవుంది శ్యామసుందరి. ఒక్కొక్క దగ్గు తెర డాబామీద మేల్కొనివున్న రఘునాథాన్ని భయపెడుతోంది. వూరంతా మాటుమణిగిపోయింది. రామాలయంలో భజనకూడా పూర్తయిపోయింది.

"నువ్వు ఆస్తంతా యెందుకిలా నాశనంచేయ దల్చుకొన్నావో మాకర్థంకావడంలేదు—,

"నువ్వు సంపాదించక పోబట్టేగా దాని విలువ తెలుసుకోలేక పోతున్నావు—,

"నిన్ను పిచ్చివాన్నిగాచేసి సుందరమ్మ ఆటలాడుతోంది—,

"చదువుకున్నందుకు కాస్తేమైనా ఆలోచించుకొని ప్రవర్తిస్తావేమో! అని అనుకున్నాం. కాని అటువంటి లక్షణాలేవీ నీలో కనిపించడంలేదు—,

"నీ ఆస్తంతా సర్వనాశనం చేయడానికే సుందరమ్మ తన సంసారంతో నీ నెత్తిమీద కూర్చొంది. ఉద్యోగం లేకుండా, పెళ్ళిచేసుకోకుండా, ఎన్నాళ్లిట్లా సుందరమ్మ సంసారాన్ని సాకుతూ కాలక్షేపం చేస్తావ్"—,

"రాగమయినిచ్చి పెళ్ళిచేస్తుందని భ్రమపడుతున్నావేమోగాని, సుందరమ్మ అటువంటి పనులేవీ చేసేమనిషికాదు. నాలుగురాళ్లు వున్నంతవరకు నిన్నంటిపెట్టుకొనివుండి, యెలాగో లాలించి, కావలసినప్పుడల్లా డబ్బుగుంజుతూ బ్రతుకు తెల్లార్చుకొని, యిద్దరి కూతుళ్ళకి పెళ్లిళ్లు చేద్దామని అనుకొంటోంది. పెద్దవాళ్ళం యేదో చెబుతున్నాం. యిక నామాట విని మంచిమార్గంలోకిరా.—

"సుందరమ్మ సంసారాన్ని దూరంగా వుంచడం చాలా మంచిది—."

ఇక ఆ వుత్తరంలోని వాక్యాల్ని పునశ్చరణ చేయడానికి యిష్టపడలేదు. యిప్పటికే అప్రయత్నంగా కళ్ళవెంట నీళ్ళూరినయి. నిద్రదారి నిద్రపోయింది. యీ విధంగా తనకావుత్తరం వ్రాసిందెవరో అక్షరాలే చెబుతున్నాయి.

సుందరమ్మ మనస్సులోగాని, చేష్టల్లోగాని, చూపుల్లోగాని, మాటల్లోగాని, చివరకు యెటువంటి పరిస్థితుల్లోగానీ, వుత్తరంలో పేర్కొన్నట్లుగా కనిపించవేం. అటువంటప్పుడు తనా వుత్తరం చదవడానికి యెందుకుమళ్ళా యత్నించాలి? రఘునాథం యీ విధంగా అనుకొంటూ ఆ వుత్తరాన్ని రెండు ముక్కలుగా చించి పారవేశాడు.

యీ సంఘటన యిలా జరిగింది - రఘునాథం తన సొంత గదిలో ఆరోజు మధ్యాహ్నంపూట వుండగా.

అప్పటినుంచి పరి పరి విధాలు ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి.

దశమి వెన్నెల మసక మసగ్గా జారిపోతోంది. రఘునాథం కళ్లు మూసుకొని యేదో పరధ్యాన్నంగా వున్నాడు. ఇంతలో రాగమయి డాబామీదికి మెల్లగా వచ్చింది—.

"బావా !" అంది – దగ్గరగావచ్చి—,

రఘునాథం హఠాత్తుగా కళ్లువిప్పి 'ఎవరూ ! పాపా !' అన్నాడు.

రాగమయి నేలమీద కూర్చుంది. రఘునాథం మంచంమీదనుండి లేచికూర్చున్నాడు.

"ఏమిటీ రావడం పాపా ! ఎవరైనా చూస్తారేమో అనే భయంకూడా లేకపోతే యెలా !" అన్నాడు రఘునాథం.

"ఎవరేమనుకొన్నా, నీతో కొన్ని విషయాలు మాట్లాడ్డానికి వచ్చాను" అంది రాగమయి.

రఘునాథంకి ఆ జవాబులో యేదో నిశ్చయం నిబిడీకరించుకొని వుందని ధ్వనిమాత్రంగా తెలిసింది. "అయినా హఠాత్తుగా యిటువంటప్పుడెందుకొచ్చింది." అనే దిగ్భ్రమ అతన్ని కంగారు పెట్టేసింది.

"ఏమిటా విషయాలు ?" అన్నాడు రఘునాథం.

"అక్కయ్యను ఆసుపత్రిలో చేర్చే విషయం గురించి మాట్లాడుదామని"— రాగమయి.

"నిజంగా ఆ విషయానికి సంబంధించే వచ్చావా !"

"అవును"—

"అయితే దాన్నిగురించి యింకా మాట్లాడేదేమిటి ? అన్నివిషయాలు అత్తయ్యకే చెప్పానుగా క్రొత్తగా యిప్పుడు నీతో చెప్పవలసిందేముంది ?" అన్నాడు రఘునాథం.

"అయితే నీ విషయం ?"

"నా విషయంగురించి నేనంతగా విచారించడ్డంలేదు. ముందు మీ అక్కయ్య రోగం నయమయితే తర్వాత విషయాలన్నీ ఆలోచించుకోవచ్చు"

"మరి యెప్పుడు పట్నంవెళ్ళి ఆస్పత్రిలో చేర్పించడం ?"

"రేపు నేను బయలుదేరివెళ్ళి అన్ని వివరాలు తెలిసికొని, మీరు వుంటానికి యిల్లొకటి మాట్లాడిరావాలిగా, అవన్నీ ముందు చక్కబెట్టుకొస్తే, తర్వాత అందరూ ఒక్కసారిగా వెళ్ళొచ్చు," అన్నాడు రఘునాథం.

రాగమయికి యిదంతా నమ్మవలసిన విషయంలాగే వుంది. బావ యెప్పుడూ మోసంచేసేమనిషి కాదని తెలుసు. కాని యెప్పుడేక్షణానికి మనుష్యులెట్లామారిపోతారో ఎవరూహించగలరు. పెళ్లిన మొహాన అడిగేద్దామనుకొంది ఒక్కసారిగా. ఆ వుత్తరం చదివినప్పటినుంచి హృదయంలో తనకేదో తీరని అవమానం పేరుకొనిపోయింది. చించి పారవేసిన వుత్తరం గాలికి యిటో అటూ కొట్టుకుపోక, వచ్చి వచ్చి తన చేతుల్లో పడి, తన మనస్సుని, శ్యామసుందరి అక్కయ్య మనస్సుని కలచివేసింది. నిజంగా రఘునాథాన్ని అడుగుదామనివచ్చిన విషయాలు తెలియకుండానే మరుగున పడిపోయి అనవసరమైనవి, తెలిసినవిచర్చగా మారిపోవటంలో రాగమయికి యెందుకో లజ్జవేసింది. పైగా ఆ వెన్నెల్లో రఘునాథం వంక తీక్షణంగా చూద్దామనుకొనికూడా వ్యర్థరాలైంది. రఘునాథం బావలాగా కనిపించలేదు. పరాయివాడిలాగా, మోసగాడిలాగా కనిపించాడు. ఇదంతా తనకు భ్రమ అని తెలుసు. కాని మనస్సులో వుద్రేకం అలా అనిపిస్తోంది. ఇంత నమ్మకంతో, అక్కయ్య క్షేమం కోరుతున్నట్లుగా నటించుతూ, తనను 'పాపా' అని ముచ్చటగా పిలిచి, మురిపిద్దామనుకుంటూ వుండే రఘునాథం ఒక్కసారిగా యింత అఘాయిత్యంకి పాల్పడతాడా ! ఇందులో యెంతవరకు నమ్మకంవుంది. రాగమయికి తల తిరిగిపోయింది.

(సశేషము)